# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- చదువును మధ్యలో ఆపేసిన పిల్లలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు
- రాబోయే మూడు సంవత్సరాల్లో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.
- విశాఖపట్నంలోని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు కేటాయించిన భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేరుస్తూ.. ఉత్వర్వులు జారీ చేసింది.

==========================

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈరోజు శాసనసభలో ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'ఈగల్' అనే ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. శాంతి భద్రతల విషయంలో డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ చేయిస్తున్నామని, నేరం రుజువైతే రెండు, మూడు నెలల్లోనే శిక్షలు పడేలా కార్యాచరణ రూపొందించామన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు తీసుకువస్తున్నామని, సైబర్ సెక్యూరిటీ విషయంలో కట్టుదిట్టమైన చర్యలను చేపట్టామని ముఖ్యమంత్రి తెలుపుతూ...

(వాయిస్ 38 సెకన్లు)

==========================

విశాఖపట్నంలోని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు కేటాయించిన భూములపై కూటమి ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. ఈ మేరకు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చుతూ ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్

హరేంధిర ప్రసాద్  ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రెవిన్యూ అధికారులు ఎండాడలో ఉన్న హయగ్రీవ భూములను ప్రభుత్వ భూమిగా పరిగణిస్తు.. వీటి రిజిస్ట్రేషన్ జరగకుండా చర్యలు తీసుకున్నారు. హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు కేటాయించిన భూ కేటాయింపులను రాష్ట్ర ప్రభుత్వం నిన్న రద్దు చేసిన విషయం తెలిసిందే.

==========================

చదువును మధ్యలో ఆపివేసిన పిల్లలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ రోజు శాసనసభలో మంత్రి మాట్లాడుతూ.... 10వ తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 100 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను గుర్తించామని, వాటిలో విద్యార్థుల సంఖ్యను క్రమంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలుపుతూ...

(వాయిస్ 35 సెకన్లు)

==========================

సులభతర వాణిజ్యం, కంప్లైయన్స్ రిడక్షన్ లో ఆంధ్రప్రదేశ్ ను ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఈరోజు సచివాలయంలో సులభతర వాణిజ్య విధానం, కంప్లైయెన్స్ రిడక్షన్ అంశాలకు సంబంధించి ఆయా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ కె.విజయానంద్ మాట్లాడుతూ.... ఇటీవల కాలంలో రాష్ట్రంలో సులభతర వాణిజ్యానికి సంబంధించి వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున సంస్కరణలు ప్రవేశపెట్టామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు వేగవతంగా అవసరమైన అనుమతులు జారీతో పాటు ప్రభుత్వ పరంగా అందించాల్సిన సహకారానికి సంబంధించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేగాక ఉత్తమ విధానాలను అవలంభించడం ద్వారా వేగవంతమైన వాణిజ్యానికి కృషి చేస్తున్నామని విజయానంద్ తెలిపారు.

విరామం

==========================

ప్రముఖ గాయకుడు, సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలక్రిష్ణ ప్రసాద్ అంత్యక్రియలు ఈరోజు జరిగాయి. తిరుపతిలోని భవానీనగర్ సర్కిల్ నుంచి లీలామహల్ సర్కిల్ వరకు అంతిమయాత్ర జరిగింది. హరిశ్చంధ్ర స్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, టిటిడి అధికారులు గరిమెళ్ల బాలక్రిష్ణ ప్రసాద్ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించామని.. కుటుంబ సభ్యుల కోరిక మేరకు తిరుపతిలో గరిమెళ్ళ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

==========================

రాజధాని అమరావతి నిర్మాణానికి 64 వేల 721 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. 2028 నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యుడు సుజనా చౌదరి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ)లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి అయ్యే నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నామని మంత్రి నారాయణ వివరించారు. అభివృద్ధి చేసిన ప్లాట్లను 3 సంవత్సరాల్లో రైతులకు అప్పగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (MDUs) వాహనాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డు పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం బాలికోన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినిలకు అందజేస్తున్న ఆహారంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు.

============================

రాష్ట్రంలో 40 వేల కోట్ల రూపాయల విలువైన సుమారు 70 నిర్మాణ పనులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో సీఆర్డీఏ 45వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంట్రాక్టు ఏజెన్సీలకు అంగీకార పత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పూర్తయ్యాక రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

============================

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు వెళ్లే విద్యార్థులందరూ తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అభిలషించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇటువంటి ప్రదర్శనలలో విద్యార్థులు ఆయా ప్రాంతాల్లో కొత్త విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని, ఆ విధంగా తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని భవిష్యత్‌లో మరిన్ని అద్భుతాలకు నాంధి పలకాలని ఆశాభావం వ్యక్తం చేసారు. మండలానికి 3 పాఠశాలలు చొప్పున జిల్లాలోని 15 మండలాల నుంచి 45 మంది విద్యార్థులు ఈ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు బయలుదేరినట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్. తిరుపతి నాయుడు తెలియజేశారు.

============================

శాసన సభ్యులకు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సర్వం సిద్ధం చేశామని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శాసనసభ్యులు, మండలి సభ్యులు అందరూ ఈ పోటీలలో పాల్గొనాలని ఆయన కోరారు.

============================
============================